## క్లుప్తంగా

### ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం విస్తృత పర్యటన


వాహనానికి అమర్చిన సీసీ కెమెరా

పెగడపల్లి: సీసీ కెమెరా నిఘాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ధర్మపురి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నాయి. ఎన్నికల సభలు, సమావేశాలు, రోడ్ షోలపై ఎన్నికల నియమావళి నేపథ్యంలో అధికార యంత్రాంగం నిఘా పెంచింది. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పయనించే వాహనాలకు సీసీ కెమెరాలు బిగించారు. వాహనాలకు బిగించిన సీసీ కెమెరా 24/7 ఆన్‌లోనే ఉంటుంది. నియోజకవర్గం వ్యాప్తంగా మూడు వాహనాలకు సీసీ కెమెరాలు బిగించారు. ప్రచారాలు, తనిఖీల వద్ద ఈ సీసీ కెమెరా ఉన్న వాహనాలకు రంగంలోకి దించి సీసీ కెమెరాలో నిక్షిప్తం చేస్తున్నారు.

### రాయికల్‌లో ఓటరు అవగాహనా ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న స్వీప్ అధికారులు

రాయికల్: స్వీప్ అధికారుల ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ఓటరు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రాయికల్‌లోని పాత బస్టాండ్, గాంధీచౌక్, శివాజీ ఏరియాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్వీప్ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, కమిషనర్ సంతోష్‌కుమార్, మెప్మా జిల్లా కో–ఆర్డినేటర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినికి సన్మానం


రక్షితను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్: మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బొడ్డుపల్లి రక్షిత రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీల్లో తృతీయస్థానం సాధించగా, విద్యార్థినితో పాటు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు దాసరి రామస్వామిని ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ సన్మానించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ జక్కుల ప్రసాద్, హెచ్‌ఎం రమణి, ఉపాధ్యాయులు చిన్నయ్య, గంగాధర్, మహేశ్, గంగరాజం, తిరుమల, శంకరయ్య, కార్తీక్, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మెట్‌పల్లి: ఆత్మరక్షణ కోసం చిన్నారులు కరాటేపై దృష్టి సారించాలని పలువురు పేర్కొన్నారు. పట్టణంలోని సూర్యోదయ హైస్కూల్‌లో సోమవారం జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బెల్టుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 75 మందికి బెల్టులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పసునూరి అవినాష్, సురిగి శ్రీనివాస్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

### జీపీ కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ కార్యదర్శి పులి మల్లేశం అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్రంలో సద్దుల బతుకమ్మ వస్తుందని ప్రభుత్వాన్ని కార్మికులు కోరినా కనికరించలేదన్నారు. బకాయిలు వెంటనే చెల్లించాలని, జిల్లా పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రాలు ఇచ్చినా కార్మికులకు వేతనాలు చెల్లించలేదన్నారు.

# ఇంటింటికీ సంక్షేమ పథకాలు

• బీఆర్‌ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనరసింహారావు


తక్కళ్లపెల్లిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడకు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కథలాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని, మరోసారి అధికారం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామని వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. సోమవారం కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఈ ప్రాంతానికి గోదావరి జలాలు తెచ్చామని, మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికీ మంచినీరు రైతులకు నాణ్యమైన కరెంట్ ఇచ్చామన్నారు. తెల్లరేషన్‌కార్డు దారులకు రూ.5 లక్షల బీమా పథకం, బీడీ కార్మికులందరికీ జీవనభృతి అందజేస్తామని అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గంగప్రసాద్, సర్పంచ్ మొలిగె లక్ష్మి, నాయకులు మేడిపెల్లి సాయిరెడ్డి, జిల్లా రాజు, కోట శంకర్, పొన్నం నరేందర్, రొక్కం హరీశ్‌రెడ్డి, చెక్కపెల్లి రాజ్‌కుమార్, కోట లక్ష్మినర్సయ్య పాల్గొన్నారు.

**మేడిపల్లిలో రోడ్‌షో**

మేడిపల్లి: మండలంలోని ని మన్నేగూడెం, దమ్మన్నపేట, కల్వకోట, వల్లంపల్లి, మేడిపల్లి గ్రామాల్లో రోడ్‌షోలో చల్మెడ పాల్గొని ప్రసంగించారు.

**బీఆర్‌ఎస్‌లో చేరిక**

మన్నెగూడెం మాజీ ఎంపీటీసీ శంకర్, కల్వకోటలో 20 మంది యువకులు, వల్లంపల్లి గ్రామానికి చెందిన హిందుసేనా యూత్, వయలైన్ యూత్, పెరుక సంఘం అధ్యక్షుడితో పాటు 70 మంది సభ్యులకు చలిమెడ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**జెడ్పీ చైర్‌పర్సన్ ప్రచారం**


కోనరావుపేట: వెంకట్రావుపేటలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట: మండలం వెంకట్రావుపేటలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంతెన సంతోష్, ఎంపీటీసీ పల్లె మంజుల, యూత్ నాయకులు ముష్కం జీవన్, గంగసారి రమణారెడ్డి, మాందాల శ్రీనివాస్, దుర్గం మహేశ్, రాగెల్ల మనోజ్, మానుక ఎల్లయ్య, కదిరె మహిపాల్, ఇమ్మడిశెట్టి వేణు పాల్గొన్నారు. మరిమడ్ల, కొండాపూర్ లో మాజీ మావోయిస్ట్ నేరెళ్ల జ్యోతి ఇంటింటా తిరుగుతూ చల్మెడను గెలిపించాలని కోరారు. ఆమె వెంట సర్పంచ్ మాట్ల అశోక్ పాల్గొన్నారు.

**గడపగడపకు..**

రుద్రంగి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు గడప గడపకు తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, మెనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా చల్మెడను భారీ మెజార్టీతో గెలించాలని కోరారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఏఎంసీ వైస్ చైర్మన్ కంటె రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమాలకర్, నాయకులు గంగం మహేశ్, రాజేశం, చందుర్తి మాజీ జెడ్పీటీసీ అంబటి గంగాధర్, రుద్రంగి మాజీ ఉపసర్పంచ్ దేవేందర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలిస్తే సంక్షేమ పథకాలు ఖతం

• మంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: కాంగ్రెస్ పార్టీ గెలిస్తే బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆపేస్తారని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.ప్రజాఆశీర్వాదయాత్రలో భాగంగా మండలంలోని నేరెళ్ళ,గోవిందుపల్లె,తుమ్మెనాల,నాగారం గ్రామాల్లో సోమవారం ఆయన ప్రచారం చేశారు. ఐదేళ్లుగా నేరెళ్ల–గోవిందుపల్లె గ్రామపంచాయతీల హద్దులు చూపించడం లేదని, దళితబంధు అనర్హులకు ఇచ్చారని స్థానికులు మంత్రిని నిలదీశారు.కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి,ఎంపీపీ చిట్టిబాబు,జెడ్పీటీసీ అరుణ, ఏఎంసీ చైర్మన్ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

వెల్గటూర్: సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి ఆదరించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని శాఖాపూర్, కప్పారావుపేట, వెంకటాపూర్, స్తంభంపల్లి గ్రామాల్లో సోమవారం ప్రజా ఆశీర్వాదయాత్రలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం లోకి రావడానికి మోసపూరిత హామీలిస్తున్నారని, ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మరన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆదరించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు,నాయకులు పాల్గొన్నారు.

# ఆశీర్వదిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

• ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి


వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న లక్ష్మణ్ కుమార్

ధర్మారం: ఓటేసి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మారం మండలంలోని కొత్తపల్లి బొమ్మారెడ్డిపల్లి, ఎర్రగుంటపల్లి, చామనపల్లి, న్యూచామనపల్లి, కొత్తూరు గ్రామాల్లో సోమవారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ కొడారి అంజన్న, నాయకులు నర్సింహులు, పాలకుర్తి రాజేశం గౌడ్, గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బొల్లి స్వామి, రూప్లా నాయక్, తిరుపతి, దేవి జనార్ధన్ పాల్గొన్నారు.


**లక్ష్మణ్‌కుమార్‌తోనే ధర్మపురి అభివృద్ధి**

వెల్గటూర్: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు సోమవారం వెల్గటూర్ మండల కేంద్రంలో గడప గడపకు ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు చేసి అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, సర్పంచ్ మేరుగు మురళి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, బీసీ సెల్ అధ్యక్షుడు ఉదయ్, ఉప సర్పంచ్ సందీప్, నాయకులు పాల్గొన్నారు.

**కాళ్లు మొక్కుతా.. కాంగ్రెస్‌కు ఓటేయండి!**

పెగడపల్లి: తమ అభ్యర్థుల ప్రచారం కోసం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు వినూత్న ప్రచారం చేస్తున్నారు. పెగడపల్లి మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్‌కు మద్దతుగా స్థానిక నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. తమ అభ్యర్థి నాలుగు పర్యాయాలు ఓటమి చెందాడని మీ కాళ్లు మొక్కుతా ఈ సారి కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని ఓ కార్యకర్త ఇలా కాళ్లు మొక్కి ఓటు అభ్యర్థించాడు.

# ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్‌కు అధికారం


వీరాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్/సారంగాపూర్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రాయికల్ మండలం వీరాపూర్, ధర్మాజీపేట, తాట్లవాయి, కైరిగూడెం, కట్కాపూర్‌లో, సారంగాపూర్ మండలం అర్పపల్లి, పెంబట్ల, కోనాపూర్, పోచంపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రతి ఉద్యోగాన్ని భర్తీ చేస్తామని జీవన్‌రెడ్డి అన్నారు.లచ్చక్కపేటలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోపి మాధవి, నాయకులు వెంకటేశ్‌గౌడ్, కోసరి మహేశ్ పాల్గొన్నారు.

# ప్రజాసేవకే రాజకీయాల్లోకి వచ్చా

• వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్ • వేములవాడలో భారీ రోడ్‌షో


వేములవాడలో నిర్వహించిన రోడ్ షోలో ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే అభ్యర్థి వికాస్‌రావు

వేములవాడ: తన తండ్రి సీహెచ్ విద్యాసాగర్‌రావు రాజకీయ సేవ చేశారని, తాను వైద్యుడిగా ఈ ప్రాంత ప్రజలకు అనేక స్వచ్ఛంద సేవలందించానని, కేవలం ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. సోమవారం వేములవాడలో నిర్వహించిన భారీ రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. వేములవాడను దత్తత తీసుకుంటానని కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. తాము దత్తత వెళ్లాల్సిన దుస్థితి తమకు లేదని, తనకు ఓటు వేసి గెలిపిస్తే తప్పకుండా సిరిసిల్ల కంటే ఎక్కువ అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రోడ్‌షోలో ఎంపీ బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, డాక్టర్ దీప, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సూరమ్మ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ**

కథలాపూర్: తాను ఎమ్మెల్యేగా గెలిచాక ఈ ప్రాంతానికి నీళ్లందించే సూరమ్మ ప్రాజెక్టు గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని వికాస్ అన్నారు. సోమవారం కథలాపూర్ మండలం కలిగోట, అంబారిపేట, తుర్తి, పోతారం, ఇప్పపెల్లి, పోసానిపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సూరమ్మ ప్రాజెక్టు, కాలువ పనులు నిర్మించడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని, ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.


బీజేపీలో చేరుతున్న కనగర్తి సర్పంచ్ భారతి

**బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ సర్పంచ్**

కోనరావుపేట: మండలం కనగర్తి గ్రామ సర్పంచ్ అనుపాటి భారతి, బాపురెడ్డి దంపతులు బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. కొన్నేళ్లుగా బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న సర్పంచ్‌కు పార్టీలో సరైన గుర్తింపు లభించకపోవడంతో సోమవారం మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు–దీప ఆధ్వర్యంలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

# చేతులు జోడించి అడుగుతున్నా.. చేతి గుర్తుకు ఓటెయ్యండి

• వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్


మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్

వేములవాడ: చేతులు జోడించి అర్థిస్తున్న చేతి గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలంటూ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ వేడుకున్నారు. పట్టణంలోని భగవంతరావునగర్‌లో సోమవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో మాట్లాడుతూ చుట్టపుచూపుగా వచ్చే నాయకులను నమ్మి మోసపోవద్దని అన్నారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి దొరల పాలన సాగిందని, ఇప్పుడొచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోకుండా బీసీ బిడ్డగా తనకు అవకాశం కల్పిస్తే వేములవాడను వెన్నెల వాడగా మారుస్తానన్నారు.

**ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం**

కథలాపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తామని ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కథలాపూర్ మండలం దుంపేట, దూలూర్, బొమ్మెన, తక్కళ్లపెల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దుంపేట గ్రామంలో ఎన్‌ఆర్‌ఐ తీగల మధురెడ్డి ఆధ్వర్యంలో 30 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు నాణ్యతలేకుండా నిర్మించి ప్రజాధనాన్ని వృథా చేసిన బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పాలన్నారు.


మధురెడ్డికి పార్టీ కండువా కప్పుతున్న ఆది శ్రీనివాస్

**ఇంటింటా ప్రచారం**

రుద్రంగి: మండల కేంద్రంలో డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మనోహర్, గడప గడపకు తిరుగుతూ ఆరు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు.

కోనరావుపేట: మండలం బావుసాయిపేట, వెంకట్రావుపేట, మామిడిపల్లి, మరిమడ్ల గ్రామాల్లో షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

### పుస్తక పఠనంతో మేధో సంపత్తి పెంపు

• డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధాకిషన్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాధాకిషన్

ధర్మపురి: పుస్తక పఠనం విద్యార్థుల్లో మేధో సంపత్తిని పెంపొందిస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ అలకొండ రాధాకిషన్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ధర్మపురిలోని మహాత్మ జ్యోతి బాపూలే తెలంగాణ రెసిడెన్సియల్ డిగ్రీ కళాశాలలో సోమవారం వారోత్సవాల్లో గ్రంథాలయాల యొక్క ప్రాముఖ్యత, పోటీ పరీక్షల్లో అవి ఏ విధంగా ఉపయోగ పడుతాయని వివరించారు. విద్యార్థి జీవితంలో పుస్తకపఠనం ఎంతో విలువైనదని అదే విధంగా ఉన్నత విద్యలో డిజిటల్ గ్రంథాలయాల పాత్రను, స్వయం వెబ్ పోర్టల్, మూక్స్ కోర్సుల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాయికల్‌లో నగర సంకీర్తన


సంకీర్తనలో భక్తుల సందడి

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయంలో మెట్‌పల్లిలోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో కార్తీక దామోదర దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్‌పల్లిలోని ఇస్కాన్ భక్తులు పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం చెన్నకేశవనాథ ఆలయంలో దీపోత్సవం చేశారు. కార్యక్రమంలో ప్రేమనంద్, గోవింద్‌దాస్, రమేశ్, నరేందర్, ఆలయ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి పాల్గొన్నారు.

### యూటీఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం


సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

కథలాపూర్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదును నాయకులు ప్రారంభించారు. మండలంలోని సిరికొండ, కథలాపూర్, భూషణరావుపేట, ఊటిపెల్లి, చింతకుంట, దుంపేట ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వం చేయించారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ప్రారంభించిన కుటుంబ సంక్షేమ నిధి పథకంలో ఉపాధ్యాయులు చేరి తమ కుటుంబాలకు భరోసా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి అంబటి భూమేశ్వర్, జిల్లా నాయకులు తులసి ఆగమయ్య, మండలాధ్యక్షుడు ఎం.డీ ఖలీద్‌పాషా, ప్రధానకార్యదర్శి ఉడుగుల వెంకటస్వామి, మల్లేశం పాల్గొన్నారు.

### నిరుపేద యువతి వివాహానికి సాయం


ఆర్థికసాయం అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

రాయికల్: పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన జుంజురి సంధ్య అనే నిరుపేద యువతి వివాహానికి సోమవారం లయన్స్‌క్లబ్ సభ్యులు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో డీసీ మ్యాకల రమేశ్, అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి ప్రవీణ్, లయన్స్‌క్లబ్ సభ్యులు సామల్ల గోపాల్, ఎలిగేటి ప్రవీణ్, ఉషాకిరణ్, అంజిరెడ్డి, బొల్లాని ఆంజనేయులు, ప్రమోద్ పాల్గొన్నారు.

### చెత్తతో నింపుతున్నారు..


చెత్తతో నిండిన అంతర్గాం బైపాస్ రోడ్డు

జగిత్యాలటౌన్: శివారు కాలనీలను బల్దియా అధికారులు పట్టించుకోకపోవడంతో 9వ వార్డులోని అంతర్గాం బైపాస్ రోడ్డులో నిత్యం చెత్త వ్యర్థాలను పడేస్తుండడంతో వెలువడుతున్న దుర్గంధంతో స్థానికులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాహనదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు చొరవ తీసుకుని చెత్త, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కల్లాలు లేక అన్నదాతల ఇక్కట్లు


కిరాయి పరదలపై ఆరబోసిన ధాన్యం

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కల్లాలు లేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. కేంద్రాలకు శాశ్వత స్థలాలు లేక పోవడంతో అధికార యంత్రాంగం ప్లాట్‌ఫాంల నిర్మాణాలపై శ్రద్ధ చూపడంలేదని తెలుస్తోంది. కేంద్రాలు ఏర్పాటు చేసిన స్థలాల్లో తెచ్చి పోసిన ధాన్యం మట్టిలో కలిసి నష్ట పోతున్నామని రైతులు వాపోతున్నారు. పెగడపల్లి మండలంలో 20 ఏళ్ల నుంచి ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాలకు శాశ్వత స్థలాలు ఏర్పాటు చేసి ప్లాట్ ఫాంలు నిర్మించే దిశగా ప్రయత్నాలు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా ఖరీఫ్, యాసంగి సీజన్లో పెగడపల్లి, నంచర్ల, నందగిరి సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో మండంలంలోని అనేక గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నారు. దీంతో రైతులు పండించిన ధాన్యం విక్రయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోయినా కేంద్రాల్లో వసతుల కల్పనలో అధికారులు విఫలమవుతున్నారని రైతులు చెబుతున్నారు. నేలపై ఆరబోస్తే ధాన్యం మట్టిలో కలుస్తుందని రైతులు పరదాలు కిరాయికి తెచ్చుకు ంటున్నారు. దీంతో పరదాల అద్దె తడిసి మోపడవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొందరు రైతులు నేలను చదును చేసి ధాన్యం పోస్తున్నారు. దీంతో కుప్పల కింద 1 నుంచి 2 క్వింటాళ్ల వరకు ధాన్యం దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు అంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను కేటాయించి కల్లాలు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.